క్లుప్తంగా

నేడు సహస్ర తులసి దళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

ఉచిత కంటి వైద్య శిబిరానికి చక్కటి స్పందన


కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్

జగదాంబ : అంధత్వ నివారణ లక్ష్యంగా కంటి వైద్య పరీక్షలను బుధవారం స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ పరీక్షలను సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్ పర్యవేక్షించారు. 200 మందికి పైగా రోగులకు ఉచిత మందులు పంపిణీ చేశారు. 20 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వారందరికీ శంకర్ ఫౌండేషన్ ద్వారా చికిత్స చేయనున్నారు. ఈ కార్యక్రమంలో రౌండ్ టేబుల్ సంస్థ సభ్యుడు మక్సూద్ అహ్మద్, సంస్థ అధ్యక్షుడు అప్పారావు, సత్తిబాబు, ముత్యాలరావు, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ


మాట్లాడుతున్న జోసెఫ్ ప్రకాష్

సీతంపేట: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని నిలపాలని నజరేన్ ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్, ఆంధ్రప్రదేశ్ రాజధాని పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో సంస్థ వ్యవస్థాపకుడు జోసెఫ్ ప్రకాష్ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టనున్నట్టు తెలిపారు. మణిపూర్‌లో కులమత బేధాలతో మారణ హోమం సృష్టిస్తున్నా, ప్రజల ఆర్తనాదాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. తక్షణమే ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి స్పందించి అల్లర్లు ఆపేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో జేఏసీ చైర్మన్ అనిల్‌పాల్, పాస్టర్ విల్సన్ బాబు, శ్రీకాంత్ జేమ్స్, డేవిడ్, రాజధాని పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రేమ్ తరంగ పాల్గొన్నారు.

విశాఖ సాహితి నూతన కార్యవర్గం

మహారాణిపేట : విశాఖ నగరంలో కవులు, రచయితలకు ప్రాచీన వేదికగా గుర్తింపు పొందిన విశాఖ సాహితి సంస్థకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆచార్య కోలవెన్ను మలయవాసిని, కార్యదర్శిగా శంకర్‌నీలు భాగవతుల, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కందాల కనక మహాలక్ష్మి, డాక్టర్ డీవీ సూర్యారావు, ఆచార్య కోలవెన్ను పాండురంగ విఠల్ మూర్తి, కోశాధికారిగా ఆచార్య ఏవీ జోగారావు, సంయుక్త కార్యదర్శులుగా పి.లలితావాసిష్ఠ, డాక్టర్ చప్ప సూర్యనారాయణ, అన్నవరపు శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులుగా ఆచార్య పీవీ కృష్ణయ్య, ద్విభాష్యం రాజేశ్వరరావు వ్యవహరించనున్నారు. వీరితో పాటు మరో పది మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. యువ కవులు, రచయితలను ప్రోత్సహించి, తెలుగు భాష, సాహిత్య వికాసానికి సంబంధించి కార్యక్రమాలు నిర్వహిస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

పవన్ క్షమాపణ చెప్పాల్సిందే


పవన్ చిత్రపటాన్ని చెప్పుతో కొట్టి నిరసన తెలుపుతున్న వలంటీర్


పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు. సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్లు

- పవన్ కల్యాణ్ వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్
- ఏవీఎన్ కాలేజీ డౌన్‌లో వలంటీర్ల మానవహారం
- పవన్ చిత్రపటాన్ని చెప్పుతో కొట్టిన వలంటీర్లు

డాబాగార్డెన్స్/జగదాంబ : మహిళ లంటే పవన్ కల్యాణ్‌కు గౌరవం లేదు. వలంటీర్లను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ డిమాండ్ చేశారు. వలంటీర్లపై పవన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా 36వ వార్డు ఏవీఎన్ కాలేజీ డౌన్ రోడ్డులో వలంటీర్లు పవన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ముందుగా పవన్ చిత్రపటాన్ని పలువురు వలంటీర్లు చెప్పుతో కొట్టి నిరసన వ్యక్తం చేశారు. వలంటీర్లలో 70 శాతం మంది మహిళలే ఉన్నప్పటికీ వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్లకు సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ ఇతర దేశాల ప్రతినిధులు మన వలంటీర్ వ్యవస్థ పనితీరును పరిశీలించి, వారి దేశంలో అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారన్నారు. రాజకీయాలకతీతంగా, కులల మతాల తేడా లేకుండా పథకాలు గడప గడపకు అందిస్తున్న వలంటీర్ వ్యవస్థపై ప్రజల్లో వ్యతిరేకత తీసుకొచ్చేందుకు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ కుట్ర పన్నారన్నారు. వలంటీర్లకు సంఘీభావంగా 36వ వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు, కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, కోడూరు అప్పలరత్నం, బిపిన్‌కుమార్ జైన్, 30వ వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బేషరతుగా క్షమాపణ చెప్పాలి



రాష్ట్రంలో వలంటీర్లందరికీ పవన్ కల్యాణ్ బేషరుతుగా క్షమాపణ చెప్పాలి. సీఎం జగన్ మాకు ఉపాధి కల్పిస్తే నీకు కన్ను కుడుతుందా. ఆడవాళ్లను గౌరవించడం ఇలాగేనా? ఇదేనా నీ వ్యక్తిత్వం..

– కనకగీత, వలంటీర్, కల్లుపాకలు, 208 సచివాలయం

నువ్వేం నాయకుడివి..?



నాయకుడు ఉపాధి కల్పించాలి.. కూల్చకూడదు. జగనన్న మాకు ఉపాధినిస్తే నీవు కూల్చే వ్యాఖ్యలు చేస్తున్నావు. చదువుకుని ఖాళీగా ఉన్న మాకు సీఎం జగన్ జీతమిచ్చి ఉపాధి కల్పించడంతో ఇంటి పోషణకు ఆధారమయయ్యాం. నీ తీరు మార్చుకో.

– వినయ్, వలంటీర్, స్ప్రింగ్‌రోడ్, 205 సచివాలయం.

దౌర్జన్యంతో సాధించలేరు..



పవన్ కల్యాణ్ ఇదా నీ రాజకీయం.. మహిళలని కూడా చూడకుండా వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడమే కాకుండా శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిపై దాడులు చేయిస్తావా. వలంటీర్లకు నువ్వు క్షమాపణ చెప్పాలి.

– సారథి, వలంటీర్, ప్రసాద్‌గార్డెన్స్, 209 సచివాలయం.

కరోనాలో ఇంటింటికీ వెళ్లి సేవ చేశాం..



కరోనా వంటి ప్రమాదకర విపత్తులో పవన్ కల్యాణ్ ఎక్కడా కనిపించలేదు. భయంతో ఇంట్లో దాకున్నాడు. సినిమా షూటింగులకు కూడా బయటికి రాలేదు. వలంటీర్లుగా మేమంతా ప్రాణాలు లెక్క చేయకుండా బాధితులకు సేవ చేశాం.

– పావని, వలంటీర్, ప్రసాద్‌గార్డెన్స్, 204 సచివాలయం.

ఎమ్మెల్యే వాసుపల్లి ఔదార్యం


ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్ : మత్స్యకార కుటుంబానికి చెందిన బడే ఎల్లాజీ (ఓ ఛానల్ కార్యక్రమ డ్యాన్సర్)కి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అండగా నిలిచారు. 30వ వార్డు కోడిపండ్యాల వీధిలో స్థానికంగా నివాసముంటున్న ఫిషింగ్ బోటు కళాశీ బడే ఎర్రయ్య కుమారుడు బడే ఎల్లాజీ కొన్ని నెలల కిందట జరిగిన లారీ ప్రమాదంలో కుడి కాలి ముడుకు భాగం తీవ్రంగా దెబ్బ తినడంతో పూర్తిగా తొలగించిన కారణంగా తన కుమారుడి ఆశయ సాధనకు ఆటంకం ఏర్పడిందని ప్రజాదర్బార్‌లో వినతిపత్రం అందజేశాడు. ఎమ్మెల్యే నేరుగా బడే ఎల్లాజీ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి తన సొంత నిధుల నుంచి రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సీఎంవో కార్యాలయ అధికారులతో మాట్లాడి ఉచితంగా డ్యాన్స్‌కు అనుకూలమైన కాలు ఏర్పాటు చేసుకోవడానికి మిగిలిన మొత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందిస్తానని హామీ ఇవ్వడమే గాక, అతను చదువు కొనసాగించడానికి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. వికలాంగుల కోటాలో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలు వార్డుల కార్పొరేటర్లు, అధ్యక్షులు, స్థానికులు పాల్గొన్నారు.

చేతివృత్తుల ప్రదర్శన ఆదాయం రూ.60 లక్షలు


చేతివృత్తి, చేనేత కార్మికులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నాబార్డు అధికారులు

డాబాగార్డెన్స్ : చేతివృత్తి, చేనేత ప్రదర్శన ద్వారా రూ. 60 లక్షల ఆదాయం రావడంపై నాబార్డు అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. కళాకారులకు ప్రజలు చేయూత ఇవ్వాలని కోరారు. నగరంలోని ఓ షాపింగ్ మాల్లో నాబార్డు సహకారంతో నేస్తం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన చేతివృత్తులు, చేనేతల ప్రదర్శన బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ మురారి మాట్లాడుతూ ప్రదర్శన, అమ్మకాలు 3 నెలల పాటు జరిగాయని, ప్రజలు చేతివృత్తి, చేనేత ఉత్పత్తుల కొనుగోలు చేయడం ద్వారా కళాకారులకు చేయూతనిచ్చినట్టు అవుతుందన్నారు. నగర ప్రజలు, పర్యాటకులు ఈ ప్రదర్శన విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. గత 3 నెలలుగా నిర్వహించిన ఈ ప్రదర్శనలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన చేతివృత్తి, చేనేత కళాకారులు స్టాల్స్ ద్వారా విక్రయాలు చేశారన్నారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం సమంతకుమార్, ఆర్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ పూర్ణిమ, నేస్తం అధినేత సురేష్, డాక్టర్ శృతి, జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలు తెలుసుకోకుండా అసత్య ప్రకటనలు

- 'ఆంధ్రజ్యోతి' ప్రతులు తగలబెట్టిన గ్రంథాలయాల బీడీసీలు
- తప్పుడు రాతలు రాస్తే సహించేది లేదని జిల్లా బీడీసీ సంఘం హెచ్చరిక


ఆంధ్రజ్యోతి ప్రతులను దగ్ధం చేస్తున్న బీడీసీలు

డాబాగార్డెన్స్: చిరుద్యోగులపై ఆంధ్రజ్యోతి ప్రచురించిన అసత్య కథనం(పుస్తక నిక్షిప్త కేంద్రం నిర్వాహకులు బ్రోకర్లంటూ.. బుక్ పేరిట బుక్కేస్తున్నారు)పై విశాఖ జిల్లా బీడీసీ సమాఖ్య బుధవారం నిరసన చేపట్టింది. ద్వారకానగర్ పౌర గ్రంథాలయ సమీపాన ఆంధ్రజ్యోతి ప్రతులను దహనం చేశారు. కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాలో ఆంధ్రజ్యోతి న్యూస్ పేపర్.. బుక్ పేరిట బుక్కేస్తున్నారు అనే వార్తను ప్రచురించారని, ఇది పూర్తి అసత్య వార్తని, పుస్తక నిక్షిప్త కేంద్ర నిర్వాహకులమైన తాము 15 ఏళ్లుగా జిల్లా గ్రంథాలయ సంస్థకు అనుబంధంగా చాలీచాలని జీతాలతో సంస్థ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నామని సమాఖ్య ప్రతినిధులు తెలిపారు. రూ.150 గౌరవ వేతనం నుంచి రూ.300, గత ఏడాదిగా రూ.3 వేల గౌరవ వేతనం తీసుకుని చిన్న పిల్లలు, నిరుద్యోగ యువతకు పుస్తక పఠనాన్ని అందిస్తూ, సమాజాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నామని, అటువంటి తమ చిరుద్యోగులపై ఆంధ్రజ్యోతి మా పొట్టకొట్టేలా వాస్తవాలు తెలుసుకోకుండా మాపై అసత్య ప్రకటనలు గుప్పిస్తున్నారని, ఈ సత్యదూరమైన ప్రకటనను బీడీసీ సమాఖ్య ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం నాయుడు ఖండిస్తున్నామన్నారు.

అన్నసమారాధనకు సరకుల అందజేత

డాబాగార్డెన్స్ : టౌన్‌కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథస్వామి ఆలయ రథయాత్ర ఉత్సవంలో భాగంగా ఈ నెల 13న ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న అన్నసమారాధనకు శ్రీవేంకటేశ్వర ట్రస్ట్ వ్యవస్థాపకురాలు, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు వాకాడ రాధ బియ్యం, నిత్యావసర సరకులు బుధవారం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టి. రాజగోపాల్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు, డాక్టర్ వీవీ రావు, కోన ప్రకాష్, లక్ష్మణ్, కోన శంకర్, ఆరుగుల రాజ్‌కుమార్, పరమేశ్వరరావు, నీలిమ, సుజాత, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బుద్ధవరపు సేవలు చిరస్మరణీయం


మేయర్‌తో బుద్ధవరపు నారాయణమూర్తి పంతులు ఐదో తరం వారసులు

డాబాగార్డెన్స్ : బుద్ధవరపు నారాయణమూర్తి పంతులు విశాఖ నగరాభివృద్ధికి ఎంతో కృషి చేశారని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కొనియాడారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఛాంబర్లో బుద్ధవరపు నారాయణమూర్తి పంతులు 5వ తరం వారసులు మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ హరి వెంకటకుమారి మాట్లాడుతూ 1901లో విశాఖ మున్సిపాలిటీకి బుద్ధవరపు నారాయణమూర్తి పంతులు చైర్మన్‌గా పని చేశారని, ఆయన కాలంలో విశాఖ నగరం అభివృద్ధికి కృషి చేయడమే గాక, ఆనాడు ఉన్న పరిస్థితుల్లో రోడ్లు, కాల్వలు, వీధి దీపాలు ఏర్పాటుతో పాటు ప్రజలకు కావల్సిన తాగునీరు అందించేందుకు కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి పంతులు వారసులు మాట్లాడుతూ పంతులు జ్ఞాపకార్థం ఆయన ఫొటో జీవీఎంసీ కౌన్సిల్ హాల్లో ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉష్ణోగ్రతల పెరుగుదలతో పర్యావరణ మార్పులు

ఏయూ క్యాంపస్: ఉష్ణోగ్రతల పెరుగుదల పర్యావరణ మార్పులకు కారణమని ఏయూ వాతావరణ శాస్త్ర విశ్రాంత ఆచార్యుడు ఒ.ఎస్.ఆర్.యు. భానుకుమార్ తెలిపారు. ఏయూ అమెరికన్ కార్నర్‌లో అమెరికన్ కాన్సులేట్ జనరల్(హైదరాబాద్), వీఐఈడబ్ల్యూఎస్-ఎంపవరింగ్ పీపుల్(భువనేశ్వర్) సంస్థలు సంయుక్తంగా బుధవారం పాత్రికేయులకు నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. అనంతరం జర్నలిజం విభాగ ఆచార్యుడు డి.వి.ఆర్.మూర్తి మాట్లాడుతూ సాంకేతికత విస్తృతి, ప్రగతిని ఉపయుక్తంగా నిలుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమెరికన్ కార్నర్ మెంటార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, వీఐఈడబ్ల్యూఎస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.భీమరావు, ఐఎండీ శాస్త్రవేత్త ఎం.సునంద, ఏయూ జర్నలిజం బీవోఎస్ చైర్మన్ ఆచార్య చల్లా రామకృష్ణ, విభాగాధిపతి ఆచార్య వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న ధర్మకర్తల మండలి

డాబాగార్డెన్స్ : టౌన్‌కొత్తరోడ్డు జంక్షన్ సమీపాన వెలసిన జగన్నాథస్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం బుధవారం జరిగింది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ ఈవో టి. రాజగోపాల్‌రెడ్డి ధర్మకర్తల మండలిచే ప్రమాణ స్వీకారం చేయించారు. మండలి చైర్మన్‌గా మారోజు శ్రీనివాస్ (ధర్మకర్తలందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు), ధర్మకర్తలుగా కొండా జ్యోతి, వాకాడ రాధ, కంచర్ల రవి, కంటుముచ్చు సాగర్, కంచుబోయిన ఉదయ బస్వంతి, ధనాల రాంబాబు, సూరిని రాము, శీల శివప్రసాద్‌తో పాటు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకుడు పి. జగన్నాథాచార్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తూ, ప్రభుత్వానికి, దేవాలయానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో 36వ వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు, కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, బిపిన్‌కుమార్ జైన్, కోడూరు అప్పలరత్నం, పలు వార్డుల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ధర్మకర్తల మండలి బంధువులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మానవ హక్కుల కౌన్సిల్ వార్షికోత్సవం


ఆచార్య సత్యనారాయణను సత్కరిస్తున్న కౌన్సిల్

డాబాగార్డెన్స్ : మానవ హక్కులను పరిరక్షించడమే ప్రథమ కర్తవ్యమని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ 24వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దామోదర సంజీవయ్య లా కాలేజీ మాజీ ఉపకులపతి ఆచార్య వై. సత్యనారాయణ పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికీ ప్రజల్లో తమకు గల హక్కులపై సరైన అవగాహన లేకపోవడంతోనే అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆచార్య వై. సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికీ మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపులు, దాడులు జరగడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఏయూ డాక్టర్ అంబేడ్కర్ లా కాలేజీ ఆచార్య విజయలక్ష్మి మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి పౌరుడు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆచార్య వై. సత్యనారాయణను కౌన్సిల్ సత్కరించింది. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పి. జగన్మోహనరావు, రిటైర్డ్ పోలీస్ అధికారి ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


నూతన సభ్యులచే ప్రమాణం చేయిస్తున విశ్వేశ్వరవర్మ తదితరులు

డాబాగార్డెన్స్ : రోటరీ క్లబ్ విశాఖ పోర్టు సిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. 2023–24 ఏడాదికి క్లబ్ అధ్యక్షుడిగా ఆర్. రామకృష్ణారావు, కార్యదర్శిగా ఎస్ఎస్ఎస్ రాజు, కోశాధికారిగా కేవీ రమణ ప్రమాణ స్వీకారం చేశారు. వీరిచే అసిస్టెంట్ గవర్నర్ డి. విశ్వేశ్వరవర్మ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రోటరీ గవర్నర్ ఆర్వీ సుబ్బారావు సభ్యులనుద్దేశించి మాట్లాడారు. రోటరీ విశాఖ పోర్టు సిటీ సేవా సంస్థ అభివృద్ధికి సభ్యులంతా కృషి చేయాలన్నారు. చక్కని సేవా కార్యక్రమాలు నిర్వహించి సంస్థని ప్రగతిపథంలో నడిపించాలని కోరారు. గత కమిటీ సభ్యులు నిర్వహించిన సేవా కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. పూర్వ గవర్నర్ డి. విశ్వనాథ్ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. రోటరీ విశాఖ పోర్టు సిటీ పూర్వాధ్యక్షుడు యూఎస్ శర్మ, పూర్వ కార్యదర్శి సుధీర్ చౌదరీ, పూర్వ కోశాధికారి కళాద్‌రాజు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ప్రమాణ స్వీకారంలో భాగంగా పర్యావరణహితాన్ని కోరుతూ సభ్యులు మొక్కలు నాటి రక్తదానం చేశారు.

క్రేన్ ఓనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం


సమవేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ చైర్మన్ రాజేష్

డాబాగార్డెన్స్ : గత కరోనా సమయం నుంచి ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామని క్రేన్ ఓనర్స్ అసోసియేషన్ చైర్మన్ పి. రాజేష్, అధ్యక్షుడు ఎస్. లీలా రాఘవరావు తెలిపారు. విశాఖ హెవీ క్రేన్ ఓనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం నగరంలోని ఓ క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టర్లు క్రేన్ అద్దెకు తీసుకున్నప్పుడు వాటి చెల్లింపులపై ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు చెందిన సంస్థలు ఇతర రాష్ట్ర కాంట్రాక్టర్లు క్రేన్ సంబంధిత బకాయిలు పూర్తిగా చెల్లించినంత వరకు ఏ విధమైన నగదు చెల్లింపులు చేయకూడదని విన్నవించుకుంటున్నామని తెలిపారు. క్రేన్ సంబంధిత ఓనర్ నుంచి నో పేమెంట్ డ్యూ సర్టిఫికెట్ పొందిన తర్వాతే పేమెంట్ ఫైనల్ క్లియరెన్స్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో అసోసియేట్ సీహెచ్‌వోఐ రవిప్రసాద్, సలహాదారుడు శంకర్‌నారాయణ్, ఉపాధ్యక్షుడు డీవీబీ కృష్ణంరాజు, కార్యదర్శి వెంకుమహంతి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి సీహెచ్ సుబ్రహ్మణ్యం, కోశాధికారి పీలా కోటేశ్వరరావు, బీవీ రవీంద్రరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

'ఈ-చలానా రద్దు చేయాలి'


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న మోటారు యూనియన్ నాయకులు

సీతమ్మధార : మ్యాక్సి క్యాబ్‌కు పెంచిన రోడ్డు ట్యాక్స్, గ్రీన్‌ట్యాక్స్, ఈ చలానా రద్దు చేయాలని కోరుతూ టాటా మ్యాజిక్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మద్దిలపాలెం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కే ఎస్వీ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ రవాణా రంగం వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ. మూడు లక్షల కోట్ల ఆదాయం వస్తుందన్నారు. తాము కట్టిన పన్నుల్లో కనీసం ఐదు శాతం ఖర్చు పెడితే డ్రైవర్లందరికీ పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయవచ్చన్నారు. ఇన్సూరెన్స్ ప్రీమియం రూ. 12 వేల నుంచి రూ. 30 వేలకు పెంచడం అన్యాయమని, దీనిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఈ-చలానాలు రద్దు చేయాలన్నారు. పెంచిన రోడ్డు ట్యాక్స్ తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు పి.రాజ్‌కుమార్, సురేష్, సత్యనారాయణరెడ్డి, రాంబాబు, శ్రీనివాస్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల ఎన్నికలు ప్రశాంతంగా జరపాలి

డాబాగార్డెన్స్ : ఈ నెల 30న జరగనున్న విశాఖ సంగీత కళాకారుల సంఘం సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికల కార్యాచరణ ప్రణాళికపై బుధవారం అడ్‌హక్ కమిటీ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. కొత్త సంస్థ ప్రారంభమైన వారికి ఓటు, పోటీ చేసే హక్కు లేదన్నారు. కొత్తగా సభ్యత్వం పొందడం కోసం ఎన్నికల రుసుం రూ. 200 చెల్లించాలన్నారు. బైలా ప్రకారం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారి ఇలా ఐదు పదవులకు వేర్వేరుగా 25న నామినేషన్లు వేయాలని, సంస్థల అధినేతలు, గాయనీ గాయకులు మాత్రమే అర్హులన్నారు. ఈ నెల 30న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల అనంతరం ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రధాన అధికారిగా ప్రముఖ వ్యాఖ్యాత పి. రాజేంద్రప్రసాద్‌ను కమిటీ నియమించిందన్నారు. మరిన్ని వివరాలకు 8179605267 నంబరులో సంప్రదించాలన్నారు. సమావేశంలో అడ్‌హక్ కమిటీ కన్వీనర్ చెన్నా తిరుమలరావు, సభ్యులు కొణతాల రాజు, మహ్మద్‌ఖాన్, కందర్ప రాధ, జేఎంఆర్ నెహ్రూ, ఎం. త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

మౌన సత్యాగ్రహంలో నగర కాంగ్రెస్ నాయకులు

డాబాగార్డెన్స్ : అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీపై కేంద్ర బీజేపీ ప్రభుత్వం పరువునష్టం కేసు వేసింది. దీనిని వ్యతిరేకిస్తూ పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు నేతృత్వంలో విజయవాడలో తలపెట్టిన మౌన సత్యాగ్రహంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవిందరాజు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వజ్జిపర్తి శ్రీనివాసరావు, పీసీసీ సభ్యుడు వైఎస్ జగన్నాథరావు తదితరులు విశాఖ నుంచి పాల్గొన్నారు.

